# డాలర్ మోహము అను అమెరికా పెళ్లి సంబంధము



"అమెరికా సంబంధం అంటే మాటలా?" అంది అనసూయమ్మ ఆశ్చర్యమూ అభినందనా కలగలిసిన గొంతుతో. చెల్లిలి కూతురికి పెళ్లి సంబంధం ఖాయం చేస్తున్నారని తెలిసి వచ్చింది.

"నా మాట గూడా అదే అక్కయ్యా! కానీ యీ పెద్ద గాడిద మొరాయిస్తున్నాడు. అయినా ఆయన, బుల్లిగాడిద మన పక్షమే అనుకో" అంది వరలక్ష్మి. పెద్దగాడిద అంటే సురేష్, చిన్న గాడిద అంటే శాంతి. ఆయనంటే సూర్యప్రకాశం. బుల్లిగాడిదంటే చిన్న కూతురు శిరీష,

"నా అభిప్రాయమూ అదే పిన్నీ! అమెరికా సంబంధం అంటే వర్త్ కాదు, అంతా డాలర్సే" అంటూ సురేష్ క్రికెట్ బంతి ఎగరేస్తూ లోపలికొచ్చాడు.

"చక్కగా చెప్పావు నాయనా! ఇండియా ఇండియానే. అమెరికా అమెరికానే!" అనసూయమ్మ నొక్కి చెప్పింది.

"ఈ సంబంధం గనక కుదిరితే కనకదుర్గమ్మ తల్లికి నూటొక్క డాలర్లతో పూజ చేయిస్తాను." అంది వరలక్ష్మి భావోద్వేగంతో.

ఆమె కళ్ల ముందు వేలకు వేలు డాలర్ కాగితాలు కదుల్తున్నాయి. ఎటొచ్చి వాటి మీద బొమ్మ మాత్రం స్పష్టంగా కనపట్టం లేదు. ఎందుకంటే ఆమె ఎప్పుడూ డాలర్ నోటు చూసెరగదు.

"కానీ నేనీ సంబంధం తిరస్కరిస్తున్నా" అన్నాడు సురేష్ చేతిలో బంతి గోడ మూలకి 'బౌల్' చేస్తూ. అతని బౌలింగ్ ధాటికి మూలనున్న మంచినీళ్ల కుండ 'క్లీన్ బౌల్డ్' అయింది.

"అయితే మాత్రం ఆ మాట కుండబద్దలు కొట్టి చెప్పాలా?" అంటూ కోపంగా లోపలికొచ్చాడు సూర్య ప్రకాశం. అనసూయమ్మ కుండ పెంకులేరటంలో నిమగ్నమైంది.

"అయితే మంచీ చెడ్డా అన్నీ మాట్లాడుకోని, పెళ్లి చూపులకి రమ్మన్న తర్వాత ఇపుడు కాదంటే ఏం బాగుంటుందిరా?" అనడిగింది వరలక్ష్మి సామాన్య ధోరణిలో.

"కాదా మరి? కాలుజారితే తీసుకోవచ్చు గానీ మాట జారింతర్వాత కుదరదు గాక కు...ద...ర..."అంటూ సూర్య ప్రకాశం చివరి మాటమీద తగినంత బరువు ఇద్దామన్న ధ్యాసలో ఉన్నవాడై, గచ్చు నేలపై ఒలికిన నీటిని గమనించని వాడై, కాలు జారి కూలబడిన వాడాయెను.

"కాలు జారినా తీసుకోవటం కష్టం నాన్నా!" తండ్రికి చెయ్యందిస్తూ అన్నాడు సురేష్.

కొడుకును మింగేసేటట్టు చూశాడు సూర్య ప్రకాశం.

"అయినా పిల్లాడికేం తక్కువరా? కన్నొంకరా? కాలొంకరా?" అడిగింది వరలక్ష్మి.

"ఏం వంకరో తెలీటానికి వాళ్లు పంపిన ఆ లాంగ్ షాట్ ఫొటోలో ఏం కనపడి చచ్చిందిలే" వెటకారంగా అన్నాడు సురేష్.

"కనపడక పోవటమేంటి? అబ్బాయి పక్కన అంత పెద్దకారు కుందనపుబొమ్మలా మెరిసిపోతుంటేనూ" అంది వరలక్ష్మి.

"మరే" అంది అనసూయమ్మ లయబద్ధంగా.

"ఇంతకీ మీరు మనిషిని చూస్తున్నట్టా? కారును చూస్తున్నట్టా?" అని పాయింట్ లాగాడు సురేష్.

"కారున్న మనిషిని చూస్తున్నట్టు" తాపీగా సమాధానించాడు సూర్య ప్రకాశం.

"పెళ్లి కొడుకు మైనస్ కారు పరిస్థితి అయితే ఏమిటి?" అడిగాడు సురేష్.

"ఇంతకీ ఈ సంబంధానికి నీ అభ్యంతరమేమిటో సూటిగా చెప్పరాదూ?"

"ఆ కుర్రాడి ముక్కూ, మొహం ఏమోగాని గుణగణాల సంగతి మీరు ఆలోచించటం లేదు. అతనెప్పుడో వెళ్లిపోయి న్యూ జెర్సీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతని రుచులేమిటి, అభిరుచులేమిటి, అలవాట్లేమిటి? మనకేం తెలీదు. స్టేట్స్ వెళ్లిన వారంతా ధనవంతులు కావచ్చు. కానీ గుణవంతులవునో కాదో చెప్పలేం గదా? అభ్యంతరం రెండు - పెళ్లి విషయంలో శాంతి అభిప్రాయం ఏమిటో మీరు కనుక్కోలేదు. దాని ఊహలు, కోరికలు దాని కుంటాయి గదా? అభ్యంతరం మూడు... ఊ... దబ్బున గుర్తు రావటంలా. తర్వాత చెప్తాను" అని ఊపిరి తీసుకున్నాడు సురేష్.

"నీ క్కాస్త మతిమరుపు గదా?" అని కొడుక్కి చురక వేశాడు సూర్య ప్రకాశం.

"ఆఁ ఇవీ పెద్ద అడ్డంకులేనా ఏమిటి? నేను మీ నాన్నని పెళ్లాడేటప్పటికి నాకు పట్టుమని పద్నాలుగేళ్లు లేవు. పెళ్లికి ముందు ఈయన వరస నాకేమన్నా తెలుసా? మరి ఇన్నేళ్ళు కాపురం చెయ్యలా సలక్షణంగా? ఆయన జనరల్ నాలెడ్జిలో ఎంత పూర్ అయినా సర్దుకుపోవటంలా?" అంది వరలక్ష్మి.

"మరే" అంది అనసూయమ్మ లయబద్ధంగా. సూర్య ప్రకాశం మొహం ఉగ్గిన్నెడు ఆముదం తాగిన పిల్లాడిలా అయ్యింది.

అంతట వరలక్ష్మి తమ్ముడు కామేశం ప్రవేశించెను. "అందుకే గదక్కా! ఆ పూర్‌నెస్‌ని నా తెలివితేటల్తో పూరిస్తున్నది? అదుగో అమెరికా వచ్చేస్తుంది కాసేపట్లో. కారు బయల్దేరిందని కబురొచ్చింది."

"వీళ్ల రాద్ధాంతాలు ఇంకా తెమల్లేదురా కామేశం!" అంది వరలక్ష్మి విచారంగా.

"ఇంకా రాద్ధాంతమేమిటి? అంతా సిద్ధాంతం ప్రకారమే వుంది. 'అమెరికా సంబంధాత్ అధిక సంబంధం నాస్తి' అని ఆర్యోక్తి. హెచ్ - 1 వీసా! కంప్యూటర్ ఇంజనీర్! కట్నం అక్కర్లేదు. అమ్మాయి అందంలో ఐశ్వర్యారాయ్ అయితే చాలు. గుణంలో గంగిగోవు అయితే మేలు. కంప్యూటర్ నాలెడ్జి ఈజ్ ప్రిఫరబుల్. ఏమనుకుంటున్నారో, ఇప్పుడు భూమి తనచుట్టూ తాను తిరుగుతూ కంప్యూటర్ చుట్టూ తిరుగుతుంది" అన్నాడు కామేశం.

"పోనీ అమ్మాయినీ ఒక మాటడిగితే పోయిందేముంది?" అని సూర్య ప్రకాశం కూతుర్ని కేకేశాడు.

చెల్లెలు, స్నేహితులు చేస్తున్న పెళ్లి చూపుల ముస్తాబు పూర్తి కాకుండానే వచ్చింది శాంతి. శాంతిని చూసి కామేశం అమందానంద కందళిత హృదయారవిందుడయ్యెను.

'ఈ దెబ్బతో ఆర్. సుబ్బా సీహెచ్. ధామ్మని పడిపోవటం ఖాయం' అన్నాడు కామేశం హుషారుగా.

"అదేంటిరా?" అనడిగింది వరలక్ష్మి.

"సుబ్బారావుని స్టేట్స్‌లో సింపుల్‌గా అట్లా పిలుస్తార్లే. అయితే అమ్మాయ్ శాంతీ! ఆ రవ్వల వడ్డాణం, ఏడు వారాల నగలు కూడా తగిలించావనుకో, కాబోయే అత్తగారు ఇంతమనిషి అంతైపోతుంది. గోల్డ్ ఈజ్ గోల్డ్ గదా! ఆపైన అబ్బాయి కూడా అలంకార ప్రియుడు." చెప్పాడు కామేశం.

"అయితే అట్లానే వుంచుకోవే శాంతీ! పెళ్ళి కాకముందే వాడిష్టమేంటి, బోడిష్టం" అన్నాడు సురేష్ కచ్చెగా.

"ఓ" అంది శాంతి హుషారుగా.

"ఈ సంబంధం గురించి ముందుగా నీ అభిప్రాయం తెలుసుకోలేదంటున్నాడు వీడు. నీ నోటితోనే చెప్పు. మా అభిప్రాయమే నీ అభిప్రాయం గదూ?" అనడిగాడు సూర్య ప్రకాశం.

"హెచ్-1 వీసా!" అన్నాడు కామేశం.

"అబ్బాయి పక్కన అందమైన కారు, ఏమనుకున్నావో?" అంది వరలక్ష్మి.

"మరే, ఏమనుకున్నావో?" అంది అనసూయమ్మ కోరస్‌గా.

"మా అభిప్రాయమే నీ అభిప్రాయం. కదూ?" మళ్ళీ అడిగాడు సూర్యప్రకాశం.

"కాదు" స్థిరంగా చెప్పింది శాంతి. "నా అభిప్రాయమే నా అభిప్రాయం! పెళ్ళి చూపులయ్యాక చెప్తాను" అంటు నోళ్లు తెరుచుకున్న వాళ్లందరి వైపు విలాసంగాను, కళ్లెగరేసిన సురేష్ వంక వినోదంగాను చూస్తూ తక్కిన అలంకరణ పూర్తి కోసం గదిలోకెళ్ళింది.

అంతట ఒకానొక పడవ కారు అచ్చ తెలుగులో 'బుర్రు'మని శబ్దము చేయుచు, ఆ యొక్క గృహ ప్రాంగణమున ఆగెను. అందుండి యొక స్ఫురద్రూపియు, ఆరడుగులపై నొక యంగుళము పొడగరియు నైన ఆగంతకుడు చూపరులకు కనువిందు చేయుచు ఆ యొక్క నేలపై కాలు మోపెను. అతడు జుట్టు నెరవని 'బిల్ క్లింటన్' వలె నుండెను. తుమ్మెద రెక్కల వంటి మీసములతో - అనగా శ్మశ్రువులతో, మందస్మిత వదనారవిందుడై ఠీవిగా నుండెను.

"బహు పరాక్! అదుగో, అమెరికా వచ్చేసిందహో!" ప్రకటించాడు కామేశం హుషారుగా.

ఆర్. సుబ్బా సి.హెచ్.తో పాటు అతని తల్లి, ఒక మిత్రుడు మాత్రమే వచ్చారు. అందరూ హుందాగా ఆసీనులు కాగానే ఫలహారాలు వచ్చాయి.

"ఇవి తర్వాత. ముందు అమ్మాయిని తీసుకురండి."అన్నాడు అతని మిత్రుడు చొరవగా.

"అవును. అబ్బాయికింకా సెవెన్ రోజులే సెలవులున్నాయి. పెళ్లి చేసుకుని పిల్లతో వెంటనే వెళ్లిపోవాలి. అసలే ఇండియా వాతావరణం కూడా సరిపడటం లేదు వాడికి. ఇంకా ఫోర్

మాచ్‌లు పెండింగ్‌లో వున్నాయి. ఇది కాకపోతే వాటిల్లో ఏదో ఒన్ సెటిల్ చేసుకోవాలి.'' అంది అతని తల్లి.

"కానీండి. నో ఫార్మాలిటీస్. అవతల ఫ్లైట్ రెడీగా వుంది'' అన్నాడు ఆర్.సుబ్బా సిహెచ్. కాలుమీద కాలాడిస్తూ. "డర్టీ ఇండియా. ఇక్కడుండలేను''

"అమ్మాయిని తీసుకురండి'' అని కేకేశాడు సూర్య ప్రకాశం.

"ఐ థింక్ షి కెన్ వాక్'' అని తన జోక్‌కి తనే నవ్వాడు ఆర్. సుబ్బా సిహెచ్.

"వావ్! భలే జోక్ వేశారు'' అని ఆంగ్ల సంభ్రమం ప్రకటించాడు కామేశం.

సావాసగత్తెలు తోడు రాగా శాంతి లోపల్నుంచి వచ్చి కుర్చీలో కూర్చుంది. "ఫిజికల్లీ ఓకే మమ్'' అన్నాడు ఆర్.సుబ్బా సిహెచ్. తల్లితో. "డిటో'' అన్నాడు మిత్రుడు.

"అమ్మాయి నేమైనా ఇంగిలీషులో అడుగు నాయనా?'' అంది అనసూయమ్మ.

"నో ఫార్మాలిటీస్. వంట వచ్చా, సంగీతం రాదా - ఇవన్నీ ఓల్డ్ ట్రాష్. ఐ వాంట్ టు నో హర్ క్వాలిఫికేషన్స్ అండ్ మెంటల్ యాప్టిట్యూడ్'' అన్నాడు ఆర్. సుబ్బా సి.హెచ్.

సురేష్ అతని వంక మిర్రి మిర్రి చూచుచుండగా, కామేశము కుతూహలముతో చూచుచుండగా, సూర్య ప్రకాశం, అతని భార్య, వదినె బహు ఆత్రముగా చూచుచుండగా, శాంతిమాత్రము ప్రశాంతముగా చూచుచు కూర్చుండెను.

"ఇంటర్నెట్ - సంధి విడదీసి, సూత్రం చెప్పగలవా? కెన్ యూ?'' ప్రశ్నించాడు ఆర్. సుబ్బా సిహెచ్. కాలు మీద కాలూపుతూ.

"సూత్రాల్తో ఇప్పుడే పనేమిటి నాయనా? పెళ్లినాటికి గదా?'' సందేహించింది అనసూయమ్మ.

"ఈ - మెయిల్ సమాసానికి విగ్రహవాక్యం గూడా చెప్పగలను'' అంది శాంతి.

"దట్స్ గుడ్! 'సైబర్ స్పేస్'కి స్పెల్లింగ్ చెప్పగలవా? కెన్ యూ?'' మళ్లీ అడిగాడు.

"బాబర్ నామా రాసిందెవరో గూడా చెప్పగలను'' జవాబిచ్చింది శాంతి.

"వెరీ నైస్! సాఫ్ట్‌వేర్‌కి వ్యతిరేక పదము వ్రాయుము.''

"పనిలో పనిగా హార్డ్‌వేర్‌కి పర్యాయపదము కూడా వ్రాసెదను.''

"రియల్లీ! ఇంతకీ సీ ప్లస్ అన్నా అయ్యిందా?'' అని మళ్లీ ప్రశ్నించాడు.

"రెండూ మైనస్‌లే బాబూ! చిన్నమ్మాయి ఎం.సెట్. కోచింగ్‌లో వుంది'' చెప్పాడు సూర్యప్రకాశం.

సురేష్ నవ్వాడు. పెళ్లి పరీక్షలో శాంతి రాణించినందుకు కామేశం సంతసించాడు. వరలక్ష్మి అనసూయమ్మ ఉమ్మడిగా ఊపిరి పీల్చుకున్నారు.

"రైట్ మమ్! ఈ మాచ్ ఓ.కే. చేద్దాం. రెస్టాఫ్ ఆల్ కాన్సిల్డ్" అన్నాడు ఆర్. సుబ్బా.

"అద్గదీ! కుర్రాడంటే అట్లా ఫాస్ట్‌గా వుండాలి. ఇంకేం బావా! శుభస్య శీఘ్రం" అన్నాడు కామేశం.

"వెంటనే ముహూర్తాలు చూడండి" అంది అతని తల్లి. "మా సన్ ఇండియాలో చాలా డేస్ ఉండలేడు".

"అవతల ఫ్లైట్ రెడీగా వుంది" అన్నాడు ఆర్. సుబ్బా సిహెచ్.

"డిటో" అన్నాడు మిత్రుడు.

వరలక్ష్మి, అనసూయమ్మా మనస్సులోనే గొంతులు కలిపి, 'ఆనంద మానంద మాయెనే, మన శాంతమ్మ పెళ్లి కూతురాయెనే' అని జంటగా పాడుకున్నారు.

"నేను కూడా మిమ్మల్ని రెండు మూడు ప్రశ్నలు వెయొచ్చా?" చటుక్కున అడిగింది శాంతి సూటిగా చూస్తూ.

కుర్చీలోంచి లేవబోతున్న కాబోయే వరుడు ఉలిక్కిపడ్డాడు. వెంటనే సర్దుకుని, "వై నాట్" అన్నాడు బింకంగా. కా.వ. తల్లి అమాంతం నోరు తెరిచింది.

"శ్రీరాముని దయ చేతను.... పద్యం పూరించుము" చిరునవ్వుతో అడిగింది శాంతి.

ఆశ్చర్యపోయాడతను. "శ్రీ రాముని దయ చేతనా? ఓ, షిట్!"

"షిట్ కాదు, సుమతీ శతకంలో ఒక బిట్! పోనీ పందొమ్మిదో ఎక్కం గడగడా అప్పజెప్పగలరా?"

"ఐ హావ్ గాట్ నో కాలిక్యులేటర్ ఆన్ మి' దీనంగా జవాబిచ్చాడు ఆర్. సుబ్బా సిహెచ్.

"భారతదేశానికి ఎల్లలేవి? సోలెడు బియ్యానికి ఎసరెన్ని పడతయ్? ఆల్ క్వశ్చన్స్ కారీ ఈక్వల్ మార్క్స్. నో ఛాయిస్."

అంతట ఆర్. సుబ్బా సి.హెచ్. మూర్ఛా క్రాంతుడయ్యెను. అతని తల్లికి బి. పి. హెచ్చెను. మిత్రుడు ఉపచర్యలలో మునిగిపోయెను.

"ద బాట్స్‌మన్ రిటైర్డ్ హర్ట్" కేకేశాడు సురేష్. అంతట శాంతి ఈ ప్రకారంగా మంగళాచరణం చేసింది.

"పితా శ్రీ! మాతృభూమిపై మమకారము లేనివాడు అర్ధాంగిపై అనురాగము చూపించునా? నేడు డర్టీ ఇండియా అనువాడు రేపు డర్టీ ఇండియన్ వైఫ్ అనడా? బ్రతుకు తెరువుకై ఖండాంతరములకు బోవచ్చును. తప్పు లేదు. కాని ఏ దేశమేగినా ఈ దేశమును మరవవచ్చునా? కనుక నా కీ వరుడు నచ్చలేదు, నచ్చలేదు, మరియు నచ్చలేదు."